


డీలిమిటేషన్‌తో అన్యాయం











- జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన వద్దే వద్దు..
- ఈ నెపంతో అధిక సంతానం ఉండాలనే నినాదం కూడా తప్పే..
- అవసరమైతే ఈ ప్రక్రియను వాయిదా వేసి, న్యాయం చేయాలి
- గతంలో మాదిరిగానే 1971 లెక్కలనే ప్రామాణికంగా తీసుకోవాలి
- ఉమ్మడి పాలమూరులో 'ఆంధ్రజ్యోతి' సర్వేలో వెల్లడించిన ప్రజలు
- డీలిమిటేషన్- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయంపై నేడు చెన్నైలో చర్చ

ఆంధ్రజ్యోతి సర్వే

మహబూబ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం దేశవ్యాప్తంగా 2026లో జరగాల్సిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఈ నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమకు అన్యాయం జరుగుతుందని స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తోపాటు బీఆర్ఎస్, కమ్యూనిస్టు పార్టీలు కూడా ఈ పునర్విభజనను వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని వాదిస్తోంది. ఈ నేపథ్యంలో తమిళనాడులోని అధికార పార్టీ డీఎంకే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన పార్టీల నాయకులతో చెన్నై వేదికగా శనివారం సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశానికి సీఎం సహా ఇతర పార్టీలందరికీ డీఎంకే ఆహ్వానం పంపింది. బీఆర్ఎస్ ఇప్పటికే తాము వెళ్తామని ప్రకటించగా.. సీఎం రేవంత్‌రెడ్డి కూడా పార్టీ అనుమతితో వెళ్తానన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రస్తుతం రెండు లోక్ సభ నియోజకవర్గాలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 17.45 లక్షల మంది ఓటర్లు ఉండగా, జనాభా ఇంచుమించుగా 25 లక్షలపైనే ఉంటుంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 16.95 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడా జనాభా ఎక్కువగానే ఉంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన

(మిగతా 6లో..)

క్లిక్.. క్లిక్..



కనిపించే అబద్ధం



జాతీయ రహదారిపై కనిపిస్తున్న ఎండమావులు

ఎర్రటి ఎండలో వర్షం పడిందేమో.. అందుకే రోడ్డుపై నీళ్లు నిలిచాయేమో అని మీరనుకుంటే పొరబడ్డట్లే. అవి నీళ్లు కావు. ఎండమావులు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్- పాలమూరు బైపాస్ రహదారిపై శనివారం కనిపించిన ఈ దృశ్యాలను చూసిన పలువురు ఔరా! అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.
-ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

'హ్యామ్'తో రహదారులకు మహర్దశ

- డీపీఆర్ కోసం పూర్తి కావొస్తున్న సర్వే
- పైలెట్ ప్రాజెక్టుగా కల్వకుర్తి నియోజకవర్గం
- 40 శాతం ప్రభుత్వ నిధులు
- 60 శాతం ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల నుంచి చెల్లింపు

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ రానుంది. హ్యామ్(హైబ్రిడ్ ఎన్యూనిటీ మోడ్)లో రాష్ట్రంలోనే కల్వకుర్తి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో నియోజకవర్గంలోని దేశంలో ఎక్కడా లేని విధంగా హైబ్రిడ్ ఎన్యూనిటీ మోడ్‌లో నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ రోడ్లను అభివృద్ధిపర్చడం జరుగుతుంది. హ్యామ్‌లో 40శాతం నిధులు ప్రభుత్వం నేరుగా ఇస్తుండగా మిగతా 60శాతం నిధులను ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకులు కాంట్రాక్టర్లకు చెల్లించనున్నాయి. ఈ స్కీంలో రోడ్ల పూర్తిస్థాయి మరమ్మతులు కానుండగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లే 15సంవత్సరాల వరకు రోడ్ల మెయింటనెన్స్‌ను పర్యవేక్షించనున్నారు. హ్యామ్‌లో కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు మండలంలో 11రోడ్లకు గాను 30కిలో మీటర్లు, కడ్తాల్ మండలంలో 15రోడ్లకుగాను 36.57కిలో మీటర్లు, మాడ్గుల మండలంలో 14 రోడ్లకుగాను 59.95 కిలో మీటర్లు, తలకొండపల్లి మండలంలో 14 రోడ్లకు గాను 52.73 కిలో మీటర్లు, చారకొండ మండలంలో 4రోడ్లకు గాను 21.20 కిలో మీటర్లు, కల్వకుర్తి మండలంలో 9 రోడ్లకు గాను 40 కిలో మీటర్లు, వెల్దండ మండలంలో 12 రోడ్లకు గాను 55.70 కిలో మీటర్లు మొత్తం 79 రోడ్లు, 296.14 కిలో మీటర్ల రోడ్లను సర్వే నిర్వహిస్తున్నారు.

ఆర్‌వీ కన్సల్టెన్సీ సంస్థ కల్వకుర్తి, చారకొండ, వెల్దండ మండలాల్లో 25 రోడ్లకు సంబంధించి సర్వే పూర్తైంది. సర్వే రిపోర్టు అనంతరం డీపీఆర్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ టెండర్లను పిలిచి మరమ్మతులు చేయనున్నారు.

● 40శాతం ప్రభుత్వ నిధులు

హ్యామ్‌లో రోడ్ల అభివృద్ధి చేసిన కాంట్రాక్టర్లకు 40శాతం ప్రభుత్వ నిధులు, ప్రభుత్వ గ్యారెంటీతో 60శాతం నిధులు బ్యాంకులు చెల్లించనున్నాయి. దీంతో పనులు చేయడానికి సైతం కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే అవకాశం ఉంది. హ్యామ్‌లో రోడ్ల అభివృద్ధి జరిగితే కల్వకుర్తి నియోజకవర్గంలోని రోడ్లన్నీ మెరుగై ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటు లోకి రానుంది.

● ఇదివరకే...

కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.189కోట్లు, పీఆర్ రోడ్లకు రూ.91కోట్ల 51లక్షలు, ఇతర రోడ్లకు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది.



హ్యామ్‌లో సర్వే చేస్తున్న ఆర్‌వీ కన్సల్టెన్సీ సంస్థ సిబ్బంది, పీఆర్ డిప్యూటీ ఈఈ బస్వలింగం

● సీఎం చొరవతో..



సీఎం రేవంత్‌రెడ్డి హ్యామ్‌లో కల్వకుర్తి నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించడానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నియోజకవర్గంలో ఇదివరకే రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు సుమారు రూ. 500 కోట్లు మంజూరయ్యాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం, వసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. నిధుల మంజూరుకు సహకరిస్తున్న సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు. - ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

నేడు ఆంధ్రజ్యోతి బంపర్ డ్రా

● ముఖ్య అతిథిగా హాజరుకానున్న డీఎస్పీ

మహబూబ్‌నగర్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్ అండ్ బైక్ రేస్ బంపర్ డ్రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ అప్పన్నపల్లిలోని తిరుమలహిల్స్‌లో గల ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పాఠకుల నుంచి 'ఆంధ్రజ్యోతి' కూపన్లు పెద్ద ఎత్తున ఎడిషన్ కార్యాలయానికి చేరుకున్నాయి. జిల్లా ఎడిషన్ పరిధిలో జరిగే లక్కీ డ్రాలో మొదటి బహుమతిగా బైక్, ద్వితీయ బహుమతిగా 185 లీటర్ల రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతిగా 32 ఇంచుల ఎల్ఈడీ టీవీ ఇవ్వనున్నారు. అదేవిధంగా 100 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు.

శంకరా.. సదాశివా..

- దారి పొడవునా పరమశివుడి నామస్మరణ
- శ్రీశైలానికి కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు

7



అంతర్రాష్ట్ర రహదారిపై పల్లకీతో కాలినడకన బీజాపూర్ భక్తులు

దుందుభీ లూటీ

- మ్యానువల్ అనుమతులతో ఇసుక రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

6



ట్రాక్టర్లో ఇసుక నింపుతున్న ఎక్స్‌కవేటర్

సంగమేశ్వరాలయంలో పారిశుధ్య పనులు



7

సంగమేశ్వర ఆలయం పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

బస్సు కిందపడి రేషన్ డీలర్ మృతి



హనుమంతు(ఫైల్)

పెబ్బేరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బస్సు కింద పడి రేషన్ డీలర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం వనపర్తి జిల్లా పెబ్బేరులో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెలిమిల్ల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ హనుమంతు(57) వనపర్తి నుంచి పెబ్బేరుకు బస్సులో బయలుదేరాడు. దళిత కాలనీ స్టాప్ దగ్గర బస్సు దిగేందుకు ఫుట్‌బోర్డుపై నిలిచి ఉండగా ముందుగా వెళుతున్న లారీని క్రాస్ చేస్తున్న క్రమంలో జారి బస్సు టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రూ.కోట్ల ఆదాయానికి గండి!

● పెబ్బేరు సంత వేలం వేయని ఫలితం

- పాత కాంట్రాక్టర్లకే మూడేళ్లుగా సంత పన్ను వసూళ్ల అప్పగింత

పెబ్బేరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పెబ్బేరు పట్టణ కేంద్రంలో ప్రతీ శనివారం నిర్వహించే సంత రాష్ట్రంలో అతిపెద్దదిగా జరుగుతుంది. సంత వేలం 2022-23 సంవత్సరంలో నిర్వహించారు. 2023- 2024 సంవత్సరం మార్చి నెల నుంచి ఇప్పటి వరకు సంత వేలం నిర్వహించ లేదు. దీంతో పురపాలిక ఆదాయానికి భారీగా రూ.కోట్లలో గండి పడుతుంది. సొంత స్థలం లేదని ప్రస్తుతం నిర్వహించే భూమి కోర్టు పరిధిలో ఉందనే ఉద్దేశంతో రెండు సంవత్సరాలుగా సంత ఆదాయం వేలానికి పురపాలక అధికారులు టెండర్లు నిర్వహించడం లేదు. దీంతో పురపాలక సంఘం భారీగా ఆదాయం కోల్పోతుంది. దీంతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతున్నది. ప్రతీ సంవత్సరం రూ.3.50 కోట్లకుపైగా ఆదాయం సమకూరేది. రెండేళ్ల కిందట వేలం దక్కించుకున్న కాంట్రాక్టర్లకు పాత ధరకే అప్పగించడంతో ఆదాయం పూర్తిస్థాయిల్లో సమకూరడం లేదు. కొందరు నిర్వాహకులు పురపాలక సంఘం అధికారుల సంతకాలు లేకుండా వ్యాపారులకు రశీదులను ఇస్తున్నారు. సంత ఆదాయం సగం కాంట్రాక్టర్లకు, సగం పురపాలిక సంఘానికి అప్పగిస్తున్నట్లు ఆరోపణ లు వినిపిస్తున్నాయి.



పెబ్బేరులో కొనసాగుతున్న సంత(ఫైల్)

● ప్రతీ వారం రూ.6.34 లక్షల చెల్లింపు ఒప్పందం..

పెబ్బేరు పట్టణ కేంద్రంలో నిర్వహించే సంతను మూడు విభాగాలుగా విభజించారు. గొర్రెలు-మేకలు, పశువుల, తైబజార్ సంతలుగా కొనసాగిస్తున్నారు. ఈ సంతకు ప్రతీ ఏటా రూ.3.50 కోట్లకు పైగానే కాంట్రాక్టర్లు వేలం పాటలో దక్కించుకుంటారు. 2022-23 ఏడాదిలో గొర్రెలు-మేకల సంత రూ.1.34 కోట్లు, పశువుల సంత రూ.1.49 కోట్లు, తైబజార్ సంత రూ.22.50 లక్షలకు దక్కించుకున్నారు. మొత్తం మూడు భాగాల సంత రూ. 3 కోట్లపైగా దక్కించుకున్నారు. వేలం నిర్వహించే ధరావతు కంటే ఏటా పది శాతం అదనంగా జోడించి ధరావతును అమల్లోకి తీసుకొస్తారు. దీంతో పాత వేలం ధరకు పోలిస్తే రూ.60 లక్షల అదనపు ఆదాయం పురపాలికకు రావాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్లు భారీగా ఆదాయం పొందుతూ.. పురపాలక సంఘానికి గండి కొడుతున్నారు. ఎలాంటి డిపాజిట్లు చెల్లించకుండా పాత కాంట్రాక్టర్ల కొనసాగుతూ ప్రతీ శనివారం సంత నుంచి వచ్చే ఆదాయంలో పురపాలికకు రూ.6.34 లక్షలు చెల్లిస్తున్నారు. కాంట్రాక్టర్లు ఎలాంటి పెట్టుబడి పెట్టకుండా సంత ఆదాయం నుంచి కాంట్రాక్టర్లు రూ.లక్షలు సమకూర్చుకుంటున్నారు.

● ప్రభుత్వ నిబంధనల మేరకు..

పెబ్బేరు సంత వేలం నిర్వహించడం ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపట్టడం జరుగుతుంది. సంత స్థలం కోర్టు పరిధిలో ఉన్నట్లుగా ఉండటంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వేలం నిర్వహించడం లేదు. మునిసిపాలిటీ సిబ్బంది లేక పోవడంతో పాత కాంట్రాక్టర్ల ద్వారా ప్రతీ వారం రూ.6.34 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. పురపాలికకు ఆదాయం తగ్గిపోయింది.
- అశోక్‌రెడ్డి, పురపాలక కమిషనర్ పెబ్బేరు

మొదలైన 'పది' పరీక్షలు

- నాగర్‌కర్నూల్ జిల్లాలో 60 కేంద్రాల్లో 10,528 మంది హాజరు
- వనపర్తి జిల్లాలో 36 కేంద్రాల్లో హాజరైన 6842 మంది విద్యార్థులు
- గద్వాల జిల్లాలో 40 కేంద్రాల్లో పరీక్ష రాసిన 7,565 మంది



నాగర్‌కర్నూల్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర కేంద్రం వద్ద హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి రూరల్/గద్వాల సర్కిల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో మొదటి రోజు ప్రశాంతంగా కొనసాగాయి. నాగర్‌కర్నూల్ వ్యాప్తంగా 60 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 10,557 మందికి గాను 10,528 మంది హాజరయ్యారు. కలెక్టర్ బదావత్ సంతోష్ అమ్రాబాద్ మండల పరిధిలోని దోమలపెంట పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అదనపు కలెక్టర్ అమరేందర్ జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకురాలు, పదో తరగతి రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి కల్వకుర్తి పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష సమయం ముగిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా 60 పరీక్ష కేంద్రాల్లో జవాబు పత్రాలను సీజ్ చేసి వాటి పరిధిలోని 18 పోలీసుస్టేషన్లకు తరలించి సమీప పోస్టాఫీసుల్లో భద్రపరిచినట్లు రమేష్‌కుమార్ తెలిపారు.

● వనపర్తి జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రారంభమైన పది పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లాలో 36 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 6853 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి రోజు 6842 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. డీఈవో మహమ్మద్ అబ్దుల్ ఘని, స్థానిక తహసీల్దార్ రమేష్ రెడ్డి ఉన్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 40 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలి రోజు జరిగిన తెలుగు/ఉర్దూ పరీక్షకు 99.58 శాతం విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి డీఈవో అహ్మద్ ఘని, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,597 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 7,565 మంది హాజరయ్యారని పేర్కొన్నా రు. గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8 మంది అంధ విద్యార్థులు సహాయకుల(స్క్రైబర్స్)చే పరీక్షలు రాసినట్లు వివరించారు. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావులు వేర్వేరుగా పలు కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా ఇన్‌చార్జి డీఈవో కొండేరులోని జడ్పీహెచ్ఎస్, ఎర్రవల్లిలోని పదవ పటాలంలో ఉన్న జడ్పీహెచ్ఎస్, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



దోమలపెంటలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

దంచికొడుతున్న ఎండలు

▸ జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో

39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

మహబూబ్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. మధ్యాహ్నం వేళ్ల ప్రజలు రోడ్లపైకి రాలేని పరిస్థితి ఉన్నది. శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 39.3 డిగ్రీలు, అలంపూర్‌లో 39.2 డిగ్రీలు, ధరూర్‌లో 39.1 డిగ్రీలు, గద్వాల, మల్దకల్ కేటీదొడ్డి, అయిజ లలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో గరిష్ఠంగా 38.4 డిగ్రీలు, కనిష్ఠంగా 24.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 37.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 25 డిగ్రీలు నమోదైంది. నాగర్‌కర్నూలు జిల్లాలో గరిష్ఠం 35, కనిష్ఠం 23 డిగ్రీలు నమోదైంది.



అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పెద్దకొత్తపల్లి హై స్కూల్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం

పెద్దకొత్తపల్లి/ తెలకపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థులు అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు, తెలకపల్లి మండలం లోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనబరి చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిలో పెద్దకొత్తపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎం.లోకేశ్, టి.శేఖర్ (9వ తరగతి), జి.రామకృష్ణ, ఆర్.లోకేశ్ (8వ తరగతి), ఆలేరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.మధుప్రియ (6వ తరగతి), డి.రామ్‌చరణ్ (9వ తరగతి) ఉన్నారు. ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లోని కొల్లూరు గాజీఎం స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, జి.నరహరి, పీడీలు బాలసుబ్రహ్మణ్యం, ఎ.బాలయ్య అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.

పేదల బియ్యం పెద్దల పాలు

● వందల క్వింటాళ్ల బియ్యం కర్ణాటక మిల్లులకు సరఫరా

● పట్టించుకోని అధికారులు



కృష్ణలో బియ్యం కోసం తిరుగుతున్న వ్యక్తులు

కృష్ణ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలు, పూట గడవని కటిక పేదలు, సామాన్య ప్రజల కోసం ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేసి రేషన్ దుకా ణాల ద్వారా ప్రజ లకు సరుకులు సరఫరా చేస్తోం ది. కడుపు నిండా భోజనం చేయాలనే సదుద్దేశంతో ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే ప్రభుత్వ సంకల్పానికి కొందరు తూట్లు పొడుస్తూ పం పిణీ చేసిన రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లులకు వందల క్వింటాళ్లు తరలిస్తోంది. నెల వచ్చిం దంటే చాలు కృష్ణ మండల కేంద్రంతో పాటు, చేగుంట, గుడేబల్లూరు, హిందూపూర్, కున్సి, తంగడిగి, గురుజాల్, అయి నాపూర్, అలంపల్లి, ముడుమాల్, మురహర్ దొడ్డి తదితర గ్రా మాల్లో కొందరు బియ్యం కొనుగోలు చేయడం కోసం మహిళా కూలీలు, యువకులను రంగంలోకి దింపుతున్నారు. వారికి దిన సరి కూలి రూ.450 చెల్లిస్తు కరెంటు కాంటాలు, ఖాళీ బస్తాలతో పాటు, వారి చేతుల్లో డబ్బులు పెట్టి ఆటోలు, బైకుల ద్వారా సాయంత్రం వేళల్లో గ్రామాలకు పంపి రేషన్ బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ బియ్యం అమ్మేవారికి కిలో బియ్యం రూ.12 నుంచి రూ.15 వరకు కాం టాలు చేసి కొనుగోలు చేస్తున్నారు. కొన్న బియ్యాన్ని దాచి అర్ధరాత్రి వేళల్లో గూడ్స్ ఆటోలో మక్తల్‌కు చేర్చి అక్కడినుంచి 167వ జాతీయ రహదారి చెక్‌పోస్టు మీదుగా కర్ణాటక రాష్ట్రం లోని రైస్‌మిల్లులకు తరలిస్తు లక్షల్లో సంపాదిస్తున్నారు. సంపాదించిన దాంట్లో మండలం లోని అధికారులకు నెలనెల మామూళ్లు అప్ప గించడంతో వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ సరఫరా కాకుండా నిలుపుదల చేయా లని, గ్రామాలు తిరిగి కొనే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దుండుభీ వాగులో భారీ యంత్రాలతో ఇసుక లోడింగ్

దుందుభీ లూటీ

▸ మ్యానువల్ అనుమతులతో ఇసుక రవాణా

▸ భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి

▸ అనుమతి లేకున్నా యంత్రాలతో తోడివేత

▸ వందలాది ట్రాక్టర్లతో తరలిస్తున్న వ్యాపారులు

▸ ప్రభుత్వ పనులకు అనుమతిచ్చామంటున్న అధికారులు



దుండుభీ వాగులో ట్రాక్టర్లకు యంత్రాలతో లోడింగ్ చేయకూడదని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు (ఫైల్)

ఉప్పునుంతల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్, మొల్గర గ్రామాల సమీపంలోని దుండుబీ వాగులో ఇసుక తరలిపోతోంది. ప్రభుత్వ పనుల పేరుతో ఇసుకాసురులు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక కొరతతో నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ అభివృద్ధి పనులను త్వతరగతిన పూర్తి చేయాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే చొరవ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప్పునుంతల తహసీల్దార్ ఇసుకకు అనుమతులు ఇస్తున్నారు. ప్రభుత్వ పథకాల పనుల ప్రొసీడింగ్ ఆధారంగా ఒక్కో రోజు 50 నుంచి 70 ట్రాక్టర్లకు రోజుకు రెండు ట్రిప్పుల చొప్పన ఒక్కో ట్రాక్టరుకు మూడు రోజులు ఇసుక రవాణా చేసే విధంగా తహసీల్దార్ అనుమతులు ఇస్తున్నారు. ఇదే అదునుగా భావించిన రెవెన్యూ అధికారులు ఒక్కో ట్రాక్టర్ వద్ద అనుమతుల కోసం ప్రతీ రోజు వెయ్యి రూపాయిలు వసూలు చేస్తున్నట్లు బహిరంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 18 నుంచి ఇసుక అనుమతులు కొనసాగుతున్నాయి. ప్రతీ రోజు దుండుబీ వాగు నుంచి అనుమతుల పేరుతో దాదాపు 200 ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండగా, అనుమతుల ముసుగులో మరో వంద ట్రాక్టర్ల వరకు ఇసుకను అక్రమంగా తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా దుండుబీ వాగు పరిసర ప్రాంత రైతులు తమ యాసంగి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ రోజు లక్షల టన్నుల ఇసుక తరలిపోతే భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లలో నీటి మట్టం తగ్గి బోర్లు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



ప్రభుత్వం పనుల పేరుతో ఇసుక అనుమతులు ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుక అనుమతులు ఇస్తున్నాం

కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పనుల కోసమని ఇసుకకు అనుమతులు ఇస్తున్నాం. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు మునిసిపాలిటీలో వివిధ ప్రభుత్వ పనులకు అనుమతులు ఇస్తున్నాం. దుండుబీ వాగులో మైనింగ్ శాఖ గుర్తించిన ఇసుక క్వారీలు ఏమీలేవు. పెదాపూర్, మొల్గర సమీపంలో ఇసుక ఉన్న చోట ఇసుక రవాణా చేస్తున్నారు. ఇసుక లోడింగ్ వద్ద పర్యవేక్షణ కోసం ముగ్గురు రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశాం. వాగులో లోడింగ్‌కు యంత్రాలకు తాము అనుమతులు ఇవ్వలేదు. అది పోలీసు శాఖ చూసుకుంటుంది.

- ప్రమీల, తహసీల్దార్, ఉప్పునుంతల

ఎక్స్‌కవేటర్‌తో లోడింగ్ చేయకూడదు

దుండుబీ వాగులో ఇసుక అనుమతులు ఉన్న ట్రాక్టర్లకు కూలీలతో ఇసుక లోడింగ్ చేయాలి తప్ప, యంత్రాలతో లోడింగ్ చేయకూడదు. అలా చేస్తున్న విషయం నా దృషికి రాలేదు. విషయం తెలుసుకొని యంత్రాలతో లోడింగ్ చేయకుండా చూస్తా. ఇసుక అక్రమ రవాణా కట్టడికి ప్రతీ ఇసుక క్వారీ వద్ద రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

- మాధవి, ఆర్డీవో, అచ్చంపేట

ఆర్మీ జవాన్ విగ్రహం ధ్వంసం

▸ దుండగులను శిక్షించాలని కుటుంబీకుల డిమాండ్



ధ్వంసమైన ఆర్మీ జవాన్ విగ్రహం

చారకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బోడబండ తండాకు చెందిన ఆర్మీ జవాన్ మహిపాల్‌నాయక్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జవాన్ కుటుంబ సభ్యులు లస్కర్‌నాయక్ శుక్రవారం కోరారు. దేశం కోసం 2004 సంవత్సరంలో ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ మహిపాల్‌నాయక్ విగ్రహాన్ని 2005 ఏర్పాటు చేశామని తెలిపారు. గురువారం రాత్రి గుర్తు తెలయని దుండగులు విగ్రహంలోని ముక్కు భాగాన్ని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాలప్పడిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని నల్గొండకు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ కల్వకుర్తి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో శనివారం ఉదయం 10గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పాల మూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి హాజరవుతారని తెలిపారు. రైతులు ప్రజాసంఘాల నాయకులు అభ్యుదయ వాదులు, మేధావులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డీలిమిటేషన్‌తో అన్యాయం

(5వ పేజీ తరువాయి)

చేపట్టాలని కేంద్రం భావిస్తుండగా, అదే విషయమై 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని మెజారిటీ ప్రజలు స్పష్టం చేశారు.

ఏంటీ వివాదం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 81, 82 ప్రకారం పార్లమెంట్‌లోని ప్రతినిధుల సభ(లోక్‌సభ)లో జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ సీట్ల సంఖ్య ఉండాలి. అలాగే ఒక నియోజకవర్గానికి, మరో నియోజకవర్గానికి మధ్య జనాభాలో భారీ తేడాలు ఉండకూడదు. ప్రతీ దశాబ్దానికి ఒకసారి జనాభా లెక్కలు నిర్వహించిన తర్వాత ఒక డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచాలి. 1971 వరకు ఈ పునర్విభజన జరిగింది. ఆ సమయంలో దేశంలో జనాభా పెరుగుదలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక విధానం తీసుకుంది. ఆ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థవంతంగా పాటించగా.. ఉత్తరాది రాష్ట్రాలు సరిగా పాటించలేదు. ఉదాహరణకు తెలంగాణలో జననాల రేటు సగటున 16.4 ఉండగా.. అదే ఉత్తరప్రదేశ్‌లో 25.1గా ఉంది. అయితే జనాభా నియంత్రణను విధానంగా తీసుకున్న సమయంలోనే నియంత్రణను పాటించిన రాష్ట్రాలు డీలిమిటేషన్ వల్ల నష్టపోతాయని భావించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 25 సంవత్సరాల వరకు పునర్విభజన చేయవద్దని చట్టం చేశారు. 2001లో మళ్లీ పునర్విభజన ప్రస్తావన వచ్చినప్పటికీ.. అప్పటి ప్రధాని వాజ్‌పేయి 84వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో 25 ఏళ్ల పాటు తటస్థంగా ఉండాలని చట్టం చేశారు. అంటే 2026లో నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంది. అయితే 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు ఇప్పటివరకు జరుగలేదు. ఒకవేళ కేంద్రం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలంటే 1971 లెక్కలనే ప్రామాణికంగా తీసుకుంటే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగదని ఇక్కడి పార్టీలు చెబుతున్నాయి. లేకపోతే జనాభా నియంత్రణలో విఫలమైన రాష్ట్రాల చేతిలోకి పవర్ వెళ్లి.. తమ ప్రాతినిధ్యం తక్కువవవుతుందనేది అంటున్నాయి. అందుకే జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయి.

అన్యాయమే అంటున్న ప్రజలు..

ఇదే అంశంపై 'ఆంధ్రజ్యోతి' నాలుగు ప్రశ్నలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో సర్వే చేసింది. నియోజకవర్గానికి 200 శాంపిళ్లతో సర్వే చేయగా, మెజారీటీ ప్రజలు జనాభా ప్రాతిపదికన డీ లిమిటేషన్ సరికాదనే చెప్పారు. ఇప్పటికే పన్నులు కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల నుంచే ఎక్కువగా వెళ్తున్నాయి. జనాభా ప్రాతిపదికన కేంద్రం నిధులు కేటాయిస్తుండటంతో ఎక్కువ పన్నులు కట్టిన రాష్ట్రాలకు తక్కువ నిధులు వస్తున్నాయని, తక్కువ పన్నులు కట్టిన రాష్ట్రాలకు ఎక్కువ నిధులు వెళ్తున్నాయనే ఆందోళనను పలువురు మేధావులు వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం అనేది రాష్ట్రాల సమాఖ్య అని.. కానీ సమాఖ్య పద్ధతిలో పాటించాల్సిన నియమాలను కేంద్రంలోని పెద్దలు పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో వివక్ష ఎదుర్కొంటుండగా, భవిష్యత్‌లో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అధికారం కూడా ఉత్తరాది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుందని, దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో 80 పార్లమెంట్ సీట్లు ఉండగా, అవి 48 పెరిగి.. 128కి చేరుతాయి. బీహార్‌లో 30, మధ్యప్రదేశ్‌లో 18, మహారాష్ట్రలో 20, రాజస్థాన్‌లో 19 పెరుగతాయి. అదే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణలో మూడు, ఆంధ్రప్రదేశ్‌లో మూడు, తమిళనాడులో రెండు మాత్రమే పెరుగుతాయి. బీలో బర్త్ రేట్ ఉన్న కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాల్లో ఒకటి తగ్గి 19కి చేరుతాయి.

యాచకురాలిపై లైంగిక దాడి?

గద్వాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ జిల్లా కేంద్రంలో భిక్షాటన చేసే ఓ మహిళలపై కొందరు వ్యక్తులు అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఓ ప్రాంతంలో ఓ మహిళ భిక్షాటన చేసుకొని తింటూ అక్కడే నివసించేది. అయితే ప్రతీ రోజు అందరితో మాట్లాడే మహిళ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే చలనం లేకుండా పడుకొని ఉన్నది. కొందరు స్థానికులు ఆ మహిళ దగ్గరకు వచ్చి ఆరా తీయగా కొందరు వ్యక్తులు తనపై దాడి చేశారని, రక్తస్రావం అవుతుందని కూడా చెప్పడంతో అత్యాచారం జరిగి ఉండవచ్చని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ విషయంపై పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆసుపత్రికి తరలిస్తున్నామని, పరీక్షల అనంతరం వివరాలు నిర్ధారించగలమని తెలిపారు.

నల్లమల అటవీ ప్రాంతంలో మంటలు



నల్లమలలోని బుడ్డారిపెంట ప్రాంతంలో చెలరేగిన మంటలు

▸ విప్పపూత సేకరణ కోసం అడవికి నిప్పు పెట్టడంతో అగ్గి

▸ కఠిన చర్యలు: దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్

▸ పది హెక్టార్ల విస్తీర్ణం మేర అడవి దగ్ధం

దోమలపెంట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో మరోసారి మంటలు చెలరేగాయి. అమ్రాబాద్ అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని ఈగలపెంట సెక్షన్‌లో కంపార్ట్‌మెంట్ 265, 281లో రెండు రోజులుగా మంటలు చెలరేగుతున్నాయి. శుక్రవారం ఇదే సెక్షన్‌లోని బీట్ అక్కమాబెలం, బుడ్డారిపెంట ప్రాంతంలో మంటలు చెలరేగి సుమారు 10 హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం దగ్ధమయిందని దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ చెప్పారు. రెండు అగ్నిమాపక బృందాలు, మరికొందరు బేస్ క్యాంపు వాచర్లు 8 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఎండల తీవ్రత అధికంగా ఉంటున్న నేపథ్యంలో గడ్డి ఎక్కువగా ఎండటం వలన మంటలు చెలరేగితే అదుపులోకి తెచ్చేందుకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో వేసవిలో విప్పపూత దొరుకుతున్నందున దాని సేకరణ కోసం అడవికి వెళ్లేవారు ఉద్దేశపూర్వకంగా మంటలు పెడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.


రుణాల పేరుతో మోసం

▸ రైతుల నుంచి లక్షల రూపాయల వసూలు

▸ నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగింత



నకిలీ బ్యాంకు ఉద్యోగికి సంబంధించి నకిలీ స్టాంపులు, నకిలీ ఐడెంటిటీ కార్డు



రుణాలు మంజూరు అయ్యాయని నకిలీ స్టాంపులతో తయారు చేసిన డాక్యుమెంట్

గద్వాల క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తాను ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగినని, పొలాలకు రుణాలు ఇప్పిస్తామని డబ్బు వసూలు చేసి మోసం చేసిన ఓ వ్యక్తిని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. బాధితులు, బ్యాంకు అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల మండలంలోని పూడూరు గ్రామానికి చెందిన ప్రసాద్ అలియాస్ గిరిప్రసాద్ అనే వ్యక్తి ఐఐఎఫ్ఎల్ బ్యాంకు ఉద్యోగిని అని చెప్పి 14 నెలల క్రితం గట్టు మండలానికి చెందిన రైతు బలరామ్‌నాయుడును నమ్మించాడు. అతడికి సంబంధించిన 10 ఎకరాల పొలానికి కోటి రూపాయల రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.3 లక్షలు తీసుకున్నాడు. అలాగే గట్టు మండలానికి చెందిన గోవిందుకు రూ.35 లక్షల రుణం ఇప్పిస్తామని లక్ష, రాజుకు రూ.35 లక్షలు ఇప్పిస్తానని మరో లక్ష తీసుకున్నాడు. చెనుగోనిపల్లికి చెందిన సర్వేశ్వర్‌రెడ్డికి రూ. 45 లక్షలు అప్పు ఇప్పిస్తానని రూ.32,350, ఇలా గట్టు మండలానికి చెందిన 12 మంది రైతుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుతో పాటు కర్ణాటకకు చెందిన రైతుల నుంచి కూడా డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు రుణాలు మంజూరయ్యాయని చెప్పి నకిలీ డాక్యుమెంట్లు ఇచ్చాడు. వారు బ్యాంకుకు వెళ్లగా, అవి నకిలీవి అని, అతడు మా ఉద్యోగి కాదని చెప్పడంతో రైతులు కంగుతిన్నారు. అలాగే కర్నూలులోని ఓ జిరాక్స్ సెంటర్‌లో కొద్దిరోజుల క్రితం నకిలీ స్టాంపులు, డాక్యుమెంట్లు తయారు చేస్తుండగా కర్నూల్‌కు చెందిన ఆ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేయించాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్న నిందితుడు ప్రసాద్‌ను బాధితుడు బలరాంనాయుడు పట్టుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, ఫిర్యాదు చేశారు. వారితో పాటు గద్వాల, కర్నూల్‌కు చెందిన బ్యాంకు ఉద్యోగులు కూడా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

మార్ట్‌లో కుళ్లిన ఆహార పదార్థాలు

▸ ఫిర్యాదు చేసిన కొనుగోలుదారుడు

▸ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



మార్ట్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు



ఫంగస్‌తో కుళ్లిన ఆహార పదార్థాలు

వనపర్తి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలో ఒక ప్రధాన సంస్థకు చెందిన మార్ట్‌లో కుళ్లిన ఆహారపదార్థాలు ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. మార్ట్‌లో ఆహారపదార్థాలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లిన వినియోగదారుడు అవి ఫంగస్‌తో కుళ్లిపోయినట్లు గుర్తించాడు. వెంటనే మార్ట్‌కు వచ్చి ఆ పదార్థాలను వెనక్కి తీసుకోవాలని కోరగా, మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో అతడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫుడ్‌సేఫ్టీ అధికారి నీలిమ, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ అధికారి డాక్టర్ రామచంద్రారావు, మునిసిపల్ హెల్త్ అసిస్టెంట్ శివలు శుక్రవారం మార్ట్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాలకు ఫంగస్ వచ్చినట్లు గుర్తించి, నమూనాలు సేకరించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేస్తామని, అనంతరం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ముందుకెళ్తామని వారు తెలిపారు. అనంతరం మార్ట్‌ను తాత్కాలికంగా మూసివేశారు.

బిర్యానీలో బొద్దింక



జడ్చర్లలోని హోటల్‌లో బిర్యానీలో వచ్చిన బొద్దింక

జడ్చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : హోటల్ బిర్యాని తిందామని వెళ్లగా అందులో బొద్దింక వచ్చింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో గల ఓ ప్రముఖ హోటల్‌లో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న శరత్‌రెడ్డి, జడ్చర్లలోని ఓ హోటల్‌లో శుక్రవారం మధ్యాహ్నం భోజనానికి వెళ్లాడు. మటన్ బిర్యానీ ఆర్డర్ చేశాడు. బిర్యాని తింటుండగా బొద్దింక కనిపించింది. వెంటనే హోటల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అందుబాటులో లేని కారణంగా రాలేకపోయారు. అదే హోటల్‌లో మరో వ్యక్తి ఆర్డర్ చేసిన చికెన్ బిర్యానీలో తాడు రావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాగా హోటల్‌కు భోజనానికి వచ్చిన వినియోగదారులు అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హోటల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైం కార్నర్

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

» నారాయణపేట డీఎస్పీ లింగయ్య



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలం రెడ్యానాయక్ తండాకు చెందిన శారు రాథోడ్ (20) హత్య కేసులో నిందితుడైన ఆమె భర్త వినోద్‌నాయక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ లింగయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ గోపితండాకు చెందిన శారు రాథోడ్ (20)కు, రెడ్యానాయక్ తండాకు చెందిన వినోద్‌నాయక్‌తో ఈ ఏడాది జనవరి 21 న వివాహం అయ్యింది. కానీ వేరే యువతిని పెళ్లి చేసుకోవాలనే ఆలోచనతో ఉన్న వినోద్ నాయక్ ఈ నెల 19న రాత్రి ఆమెతో గొడవ పెట్టుకొని కొట్టాడు. ఎందుకు కొడుతున్నావని తల్లిదండ్రులు అతడిని నిలదీయడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి పది గంటల సమయంలో తిరిగి వచ్చి భార్య గొంతు నులిమి చంపేశాడు. నేరం తన మీదకు రాకుండా చీరతో ఉరి వేసుకుందని, ఏదో పురుగుల మందు తాగిందని నమ్మించేందుకు యత్నించాడు. అది కుదరక పోవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో శుక్రవారం నారాయణపేట బారంబావి దగ్గర నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించుకొని చీరను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, నారాయణపేట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భర్తను చంపిన భార్య

నర్వ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భర్తను భార్య గొంతు నులిమి చంపేసింది. ఈ దారుణ ఘటన నారాయణపేట జిల్లా, నర్వ మండలంలోని లంకాల గ్రామంలో శుక్రవారం జరిగింది. మృతుడి అక్కా బావలు దుప్పల్లి పద్మమ్మ, దుప్పల్లి నర్సింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లంకాల గ్రామానికి చెందిన పాలెం అంజన్నకు, మక్తల్ మండలం కర్నె గ్రామానికి చెందిన రంగమ్మతో 17 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంజన్న ప్రస్తుతం నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి ఐటీఐ కళాశాలలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల తన భూమిని దాయాదులకు పట్టా చేసి ఇవ్వడంతో రూ.60 వేలు వచ్చాయి. ఆ డబ్బు కోసం భార్య రంగమ్మ తరుచూ గొడవ పడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి నిద్రలో ఉన్న అంజన్న గొంతుకు తాడు బిగించి చంపేసింది. ఈ మేరకు అక్కా బావలు పద్మమ్మ, నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ కుర్మయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వెల్దండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల పరిధిలోని రాగాయిపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దాదాపు 55 నుంచి 60 ఏళ్ల వయసున్న మహిళ వంకాయ రంగు నైటీ ధరించినట్లు వారు తెలిపారు. మతిస్థిమితం సరిగా లేని ఆమె భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కేసరి సముద్రంలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతదేహం లభించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెరువులో తేలిన మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని, మృతదేహాన్ని వెలికి తీసి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గోధుమ రంగు అంగి, ఖాకీ, నీలి రంగు లుంగీ ఉన్నట్లు గుర్తించారు. ఎవరికైనా అనుమానం ఉంటే మార్చురీలోని మృతదేహాన్ని పరిశీలించాలని సూచించారు. సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యం అయ్యింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని క్రిస్టియన్‌పల్లి కాలనీకి చెందిన యాస్మిన్‌బేగం శుక్రవారం తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. పిల్లలు లేచి చుట్టు పక్కల వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో అచ్చంపేటలో ఉండే తాత మహమ్మద్ ములాన్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే జిల్లా కేంద్రానికి చేరుకొని బంధువులు, చుట్టు పక్కల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాస్మిన్‌బేగం భర్త మహమ్మద్ మస్తాన్ జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ హత్యపై నిరసన

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ హత్యను నిరసిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్లు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ట్రాన్స్‌జెండర్ దీపిక చిత్ర పటానికి నివాళి అర్పించారు. నిందితుడి చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ దీపికను బన్నీ అనే యువకుడు ప్రేమ పేరుతో మోసం చేయడమే కాకుండా, కిరాతకంగా చంపాడని పేర్కొన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మరోమారు ఇలాంటి సంఘటనలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాన్స్‌జెండర్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ట్రాన్స్‌జెండర్లు రాములమ్మ, నిషా తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్, మార్చి, 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ - మన్యంకొండ రైల్వే స్టేషన్ల మధ్య, మోనప్పగుట్ట సమీపంలో శుక్రవారం సాయంత్రం 7:30 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నది. ఆమె మృతదేహం రెండు భాగాలుగా విడిపోయింది. ఆ మహిళ ఒంటిపై చిలకపచ్చరంగు చీర, ఎరుపు రంగు జాకెట్ ఉంది. గుండ్రటి ముఖము, ఎత్తుపళ్లు ఉన్నాయని రైల్వే పోలీసులు వెల్లడించారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ మాయం

పాన్‌గల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండల కేంద్రంలోని ఎస్‌వీఎస్‌ఎస్ రైస్ మిల్లు నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ మాయం అయ్యింది. దీనికి సంబంధించి మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. యాసంగి, వానకాలం సీజన్‌లలో ఆ మిల్లుకు కేటాయించిన దానిలో 2712.376 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైందని తెలిపారు. ధాన్యం విలువ రూ.8.85 కోట్లు ఉంటుందన్నారు. ధాన్యం మాయంపై పౌర సరఫరాల సంస్థ అసిస్టెంట్ మేనేజర్ ధరావత్ బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరిన దామరగిద్ద మండలం, కానుకుర్తి శివ భక్తులు

శంకరా.. సదాశివా.. చంద్ర శేఖరా!



శాంతినగర్ మీదుగా శ్రీశైలానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులు

» దారి పొడవునా పరమ శివుడి నామస్మరణ
» శ్రీశైలానికి కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు
» 350 - 400 కిలోమీటర్ల పాదయాత్ర
» ఉగాది రోజు మల్లికార్జునుడు, భ్రమరాంబల దర్శనం
» అమ్మవారికి చీర, సారె సమర్పణ

వడ్డేపల్లి/ గట్టు/ అయిజ/ అలంపూర్/ దామరగిద్ద, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా తరలివెళ్తున్నారు. అలాగే నారాయణపేట జిల్లా, దామరగిద్దకు చెందిన భక్తులు కూడా శుక్రవారం శ్రీశైలానికి పాదయాత్రగా తరలివెళ్లారు. అంతకు ముందు కానుకుర్తి శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది నాటికి వారు శ్రీశైలానికి చేరుకొని బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటామని వారు తెలిపారు. దారిపొడవునా శివనామస్మరణ చేస్తూ ఉగాది పండుగ నాటికి శ్రీశైలం చేరనున్నారు. మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవిలను దర్శించుకుంటారు. అమ్మ వారిని వారు తమ ఆడపడుచుగా భావిస్తారు. ఉగాది పర్వదినం రోజు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి, పుట్టినింటికి రమ్మని ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. అందుకో సంపండ్లు, ఫలహారాలు, పూలు, పట్టు వస్త్రాలతో పాటు పూజా సామగ్రిని దట్టీల్లో నింపుతారు. వాటిని అలంకరించిన పల్లకిలో ఉంచుకొని భుజాలపై మోసుకొని వెళ్తారు. ముందుగా పాతాళగంగలో పుణ్య స్నానాలు చేసి స్వామిని దర్శించుకుంటారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ఒడి బియ్యం సమర్పిస్తారు.

పది రోజుల క్రితమే..

కర్ణాటక రాష్ట్రం, రాయచూరు, గుల్బర్గా, మహారాష్ట్రలకు చెందిన భక్తులు 10 రోజుల క్రితమే వారి స్వస్థలాల నుంచి శ్రీశైలానికి పాదయాత్రను ప్రారంభించారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా, శివనామస్మరణ చేస్తూ యాత్రను కొనసాగిస్తున్నారు. మూడు రాష్ట్రాల మీదుగా వారి యాత్ర కొనసాగుతోంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని శాంతినగర్ మీదుగా కాలినడకన వెళ్తున్న భక్తులను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. పూర్వం తమ పెద్దలు కర్ణాటక ప్రాంతం నుంచి గుర్రాలపై శ్రీశైలం క్షేత్రానికి వెళ్లేవారని తెలిపారు. అదే విధంగా ప్రతీ సంవత్సరం తాము పాదయాత్రను కొనసాగిస్తున్నామని తెలిపారు.

ప్రతీ రోజు 40 కిలోమీటర్లు

ప్రతీరోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల వరకు నడచి, మధ్యాహ్న భోజనం చేసి, విశ్రాంతి తీసుకొని తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు నడక సాగిస్తామని తెలిపారు. ప్రతీ రోజు సరాసరి 40 కిలోమీటర్ల దూరం నడుస్తామని చెప్పారు. తమ వెంట ఒక వాహనంలో భోజనానికి అవసరమైన సామగ్రిని తీసుకెళ్తున్నామని తెలిపారు. దారి పొడవునా ఉన్న కొన్ని దేవాలయాల వద్ద స్థానికులు, దాతలు అన్నదానం చేస్తున్నారని తెలిపారు.

జోగుళాంబ సన్నిధిలో నిద్ర

శ్రీశైలానికి నాలుగు ప్రవేశద్వారాలు ఉన్నాయని దక్షిణాన సిద్ధవటం, ఉత్తరాన ఉమామహేశ్వరం, తూర్పున త్రిపురాంతకం, పడమరన అలంపురం క్షేత్రాలు ఉన్నాయని తెలిపారు. తాము అలంపురంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి సన్నిధిలో ఒక రాత్రి నిద్ర చేసి, అమ్మవారి అనుగ్రహం పొంది పాదయాత్ర సాగిస్తున్నామని వివరించారు. కాశీలోని గంగానదిలో స్నానం ఎంత పవిత్రమో, దక్షిణకాశీ అలంపురంలో నిద్ర చేస్తే అంతే పుణ్యం కలుగుతుందని తమ విశ్వాసం అన్నారు. దారిలో ఏ ఆపద కలుగకుండా మల్లన్న స్వామే తమను కాపాడుతాడని చెప్పారు. ఉగాది నాడు శ్రీశైలానికి చేరుకొని స్వామి, అమ్మవార్ల దర్శించుకొని పూజలు చేస్తామని, అనంతరం స్వగ్రామాలకు చేరుకుంటామని చెప్పారు. ఊరికి వచ్చాక, కొత్తకుండలో పరమాన్నం వండి బంధువులకు, స్నేహితులకు ప్రసాదంగా పంచుతామని తెలిపారు.

ఎలాంటి అలుపూ ఉండదు



కర్ణాటక ప్రాంతంలోని బీజాపూర్, గుల్బర్గ, యాదగిరి, శాషాపూర్, హోస్పేట్, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన శ్రీశైలం క్షేత్రానికి వెళ్తుంటారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వాములను స్మరిస్తూ వెళ్తుంటే, అడుగులు అవే ముందుకు సాగుతాయి. దాదాపు 450 కిలోమీటర్లు సునాయాసంగా నడక సాగించినా అలసట తెలియదు. నేను 13 సంవత్సరాల నుంచి పాదయాత్ర చేస్తున్నాను.

- జోళాయప్ప, గుల్బర్గ, కర్ణాటక

ఎండ ఏమీ చేయదు



నేను ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్నాను. 15 సంవత్సరాల నుంచి యాత్ర చేస్తున్నాను. ఇప్పటివరకు దారిలో ఎలాంటి అనారోగ్యానికి గురి కాలేదు. అమ్మవారిని తలచుకొంటే ఎండ, చలి ఏమీ చేయవు. మనసులో దైవచింతన ఉంటే ఎంత దూరమైనా సునాయాసంగా ప్రయాణం సాగించవచ్చని నా నమ్మకం.

- రాజేశ్వరి, ఎగనూర్

పాదయాత్రికులకు అన్నదానం

కర్ణాటక నుంచి శ్రీశైలం మల్లిఖార్జున స్వామి దర్శనానికి కాలినడకన వెళ్తున్న బక్తులకు జోగుళాంబ గద్వాల జిల్లా, బల్గెరలోని దిగంబర స్వామి ఆలయం దగ్గర అన్నదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతునాయుడు శుక్రవారం పూజలు నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.



బల్గెరలో దిగంబర స్వామీ ఆలయం దగ్గర భక్తులకు అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు హన్మంతునాయుడు

భక్తుల కోసం ఉచిత వైద్యశిబిరం

శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన వెళ్తున్న భక్తుల కోసం జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ స్టేజీ వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరంలో ప్రభుత్వ వైద్యాధికారి విష్ణు ఆధ్వర్యంలో అవసరమైన భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రల నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్న భక్తులు అయిజ, పర్దిపూర్, వెంకటాపూర్ గ్రామాల మీదుగా వెళుతున్నారు. అస్వస్థతకు గురైన భక్తులకు సత్వర వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందిస్తున్నామన్నారు. ఎండ తీవ్రం అయిన తర్వాత వీలైనంత వరకు పాదయాత్ర చేయొద్దని, నీరు అధికంగా తాగాలని భక్తులకు సూచించారు.



వెంకటాపూర్ గ్రామస్టేజీ వద్ద ప్రభుత్వ వైద్యాధికారి విష్ణు ఆధ్వర్యంలో భక్తులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

సంగమేశ్వరాలయంలో పారిశుధ్య పనులు



సంగమేశ్వరం ఆలయం పరిసరాల్లో కొనసాగుతున్న పరిశుభ్రత పనులు

కొల్లాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది నుంచి పూర్తిగా బయటకు వచ్చిన సంగమేశ్వరాలయంతో పాటు, పరిసరాలను శుక్రవారం శుభ్రం చేశారు. దాదాపు ఎనిమిది నెలల పది రోజుల అనంతరం గురువారం పూర్తిగా బయటపడింది. ప్రాంగణంలో పేరుకుపోయిన బురదను తొలగించే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. గర్భాలయంలో బురదను పూర్తిగా తొలగించిన అనంతరం భక్తుల స్వామి దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు అర్చకుడు తెలకపల్లి రఘురామయ్య శర్మ తెలిపారు. ఆలయంలోని వేపదారు శివలింగాన్ని భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఆలయానికి వెళ్లే దారిని శుభ్రం చేశారు. సోమశిల నుంచి నదిలో బోటులో ప్రయాణించి సంగమేశ్వరుడిని దర్శించుకోవచ్చు.

కొవిడ్ 'జనతా కర్ఫ్యూ'కు ఐదేళ్లు

» దేశ వ్యాప్తంగా 2020, మార్చి 22న బ్లాక్ డే
» గద్వాల జిల్లాలో 19,627 మంది బాధితులు
» కరోనాతో 257 మంది మృత్యువాత
» 44,641 మందికి వాక్సిన్ బూస్టర్ డోస్



వ్యాక్సిన్ వేయించుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

గద్వాల క్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : కరోనా మహమ్మారి విస్తృతంగా వ్యాప్తి చెందుతుండటంతో 2020, మార్చి 22న కేంద్ర ప్రభుత్వం మార్చి 22న జనతా కర్ఫ్యూ నిర్వహించింది. ఆ రోజు నుంచి రాష్ట్రంలో కొన్ని నెలల పాటు లాక్ డౌన్ విధించిన కేంద్ర ప్రభుత్వం కరోనా కట్టడికి పలు చర్యలు తీసుకున్నది. అయినా కరోనా వ్యాప్తి కొనసాగింది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం జోగుళాంబ గద్వాల జిల్లాలో కరోనా ఫస్ట్ వేవ్ సమయంలో 1,25,789 మందికి పరీక్షలు నిర్వహించగా, 6,076 మందికి నిర్ధారణ అయ్యింది. 2021 రెండ వ వేవ్ సమయంలో 4,84,363 మందికి పరీక్షలు నిర్వహించగా, 11,788 మందికి పాజి టివ్ వచ్చింది. మూడవ వేవ్‌లో 2,02,752 మందికి పరీక్షలు నిర్వహించగా 1,763 మందికి కరోనా సోకినట్లు వెల్లడైంది. మొత్తం మూడు వేవ్‌లలో 8,12,904 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 19,627 మంది కరోనా భారిన పడ్డారు. జిల్లా వ్యాప్తంగా కరోనాబారిన పడిన వారిలో 257 మంది మృత్యువాత పడినట్లు అధికారులు చెప్తున్నారు. అయితే జిల్లాకు చెందిన పలు వురు బాధితులు హైదరాబాద్, కర్నూల్ తదితర ప్రాంతాల్లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం.



అప్పటి జిల్లా కలెక్టర్ సమక్షంలో వ్యాక్సిన్ వేసుకుంటున్న వృద్ధుడు(ఫైల్)

విస్తృతంగా వ్యాక్సినేషన్

జోగుళాంబ గద్వాల జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారు 4,60,075 మంది ఉండగా, మొదటి విడతలో 4,62,195 మందికి, రెండవ విడతలో 4,75,117 మందికి వ్యాక్సిన్ వేసినట్లు అధికారులు తెలిపారు. 15 నుంచి 17 సంవత్సరాల వారు 32,671 మందికి గాను, మొదటి విడతలో 32,620, రెండవ విడతలో 32,221 మందికి వ్యాక్సినేషన్ చేశారు. 12 నుంచి 14 సంవత్సరాల వారు 20,160 మంది లక్ష్యం కాగా, మొదటి విడతలో 21,206, రెండవ విడతలో 20,494 మందికి వ్యాక్సిన్ వేశారు. అలాగే హెల్త్‌కేర్ సిబ్బంది 2,317 మందికి గాను 2,347 మందికి వ్యాక్సిన్ వేశారు. ఫ్రంట్‌లైన్ వర్కర్లు 2,997 మందికి గాను 3,174 మందికి వ్యాక్సిన్ వేసి లక్ష్యాన్ని పూర్తి చేశారు. అలాగే 60 సంవత్సరాల పైబడిన వారు 59,267 మంది ఉండగా, 44,641 మంది బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారు 4,07,238 మంది లక్ష్యం కాగా, 2,71,896 మంది వాక్సినేషన్ చేయించుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

మాస్కులు ధరించడం మంచిదే..



కరోనా మహమ్మారి ఎంతో మంది ప్రాణాలను హరించింది. ప్రతీ ఒక్కరు ఆరోగ్య పరమైన జాగ్రత్తలను పాటించాలి. ఇప్పుడు కూడా ప్రతీ ఒక్కరూ సామాజిక దూరం పాటించడంతో పాటు మాస్కులను ధరిస్తూ, శానిటైజర్‌ను ఉపయోగించుకోవాలి. దగ్గు, జలుబు విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అవసరం అయినప్పుడు వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ సిద్ధప్ప, డీఎంహెచ్‌వో

ఇరువర్గాల ఫిర్యాదులపై విచారణ



అమరచింత మునిసిపల్ కార్యాలయం వద్ద విచారిస్తున్న డీఎస్పీ

అమరచింత, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత మునిసిపల్ కమిషనర్, సీపీఎం నాయకులు పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. అమరచింత మునిసిపల్ కార్యాలయంలో ఈ నెల 18న మునిసిపల్ కమిషనర్ రవిబాబు, మాజీ వైస్ ఛైర్మన్, సీపీఎం అమరచింత, ఆత్మకూరు మండల కార్యదర్శులు జీఎస్ గోపి, రాజుల మధ్య వాగ్వాదం జరిగింది. అదే రోజు మునిసిపల్ కమిషనర్ రవిబాబు తనను కులం పేరుతో దూషించాడని ఆరోపిస్తూ మునిసిపల్ వైఎస్ ఛైర్మన్ జీఎస్ గోపిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే సీపీఎం నాయకుడు రాజు తనను కులం పేరుతో దూషించారని, తోసి వేశారని ఆరోపిస్తూ మునిసిపల్ కమిషనర్‌తో పాటు మేనేజర్, వార్డు అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేశ్‌లు ఇరువురి ఫిర్యాదుల మేరకు సాక్షులను వేర్వేరుగా స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టి, వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్‌లతో మాట్లాడి సంఘటన పూర్వాపరాలను తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పరస్పరం చేసుకున్న ఫిర్యాదు లపై విచారించినట్లు తెలిపారు.

బంగారం, వెండి చోరీ

» కల్వకుర్తిలో ఘటన



పరిశీలిస్తున్న ఎస్‌ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తిలక్‌నగర్‌కు చెందిన శ్రీను గురువారం కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. శుక్రవారం ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చడగా బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, 40 తులాల వెండిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

- మేఘనాథ్, ట్రాన్స్‌కో ఏఈ, వంగూరు



వంగూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎలాంటి కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఏఈ మేఘనాథ్ అన్నారు. వ్యవసాయం, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

లో వోల్టేజీ రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

మండలంలో 7,458 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా ఇటీవల 22 ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాం. లో వోల్టేజీ సమస్య రాకుండా సిబ్బందిని అప్రమత్తం చేశాం.

మండలంలో ఎన్ని విద్యుత్ ఉప కేంద్రాలున్నాయి ?

మండలంలో మొత్తం ఆరు విద్యుత్తు ఉప కేంద్రాలున్నాయి. కొత్తగా గాజర, ఉల్పర గ్రామాలకు మంజూరయ్యాయి.

గృహజ్యోతి పథకం కింద ఎంత మందికి ఇస్తున్నారు ? కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందా ?

గృహజ్యోతి కింద ప్రతీ నెల 4,450 కనెక్షన్లకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నాం. 1,628 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త వారికి ఈ పథకం అమలుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వం ప్రకటిస్తేనే కొత్త వారికి అవకాశం ఉంటుంది.

న్యూస్ బాక్స్

బీసీ గురుకులాల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలి

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రజిత



అచ్చంపేటటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బీసీ గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రజిత అన్నారు. గురువారం పట్టణంలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో ఆమె మాట్లాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతులలో మిగిలిపోయిన సీట్లకు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు బోనఫైడ్, ఆధార్ కార్డు, ఫొటోతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఖర్చు చేయాలి

- డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్

తాడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆయా వర్గాల ప్రజల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు మండలంలోని నాగదేవ్‌పల్లి, అంతారం, ఆకునెల్లికుదురు, మేడిపూర్ గ్రామాల్లోని దళిత వాడల్లో సందర్శించి కుల వివక్ష రూపాలను, దళితవాడలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివక్ష నిర్మూలనకు జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు హనుమంతు, మేస్త్రీ వెంకటయ్య, శ్రీశైలం, రాములు, లక్ష్మయ్య, ఎస్.కృష్ణ, బంగారయ్య, ఆంజనేయులు, వెంకటయ్య పాల్గొన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణ పనుల తనిఖీ

బిజినేపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 21 : మండలంలోని గంగారం ఫారెస్ట్‌లో అటవీ జంతువుల దాహార్తి తీర్చేందుకు మర్రిగుట్ట సమీపంలో నిర్మిస్తున్న చెక్‌డ్యాంను నాగర్‌కర్నూల్ ఎఫ్ఆర్‌వో దేవరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్‌డ్యాం నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. అలాగే నిర్మాణ పనులు పూర్తైతే వాటర్ క్యూరింగ్ చేపట్టాలన్నారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయించాలని గంగారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చంటిని ఆదేశించారు.

28న చలో ఢిల్లీకి తరలి రండి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టం తీసుకురావాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 28న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పులిజాల పరశురాములు కోరారు. కల్వకుర్తిలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రామచంద్రయ్య, హమీద్, శ్రీనివాసులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన

వంగూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో శుక్రవారం మానవ అక్రమ రవాణా నిర్మూలనపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్ఐ జాంగీర్ పాల్గొన్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం మానవ అక్రమ రవాణాను ఎదుర్కొనడానికి ప్రభుత్వ నిబంధనలు, సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు నర్మద, ఏపీఎం శ్రీనివాసులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు ప్రశాంతం

- దోమలపెంట పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ బదావత్ సంతోష్

- మొదటిరోజు సజావుగా పరీక్ష

దోమలపెంట/ కొల్లాపూర్/ అచ్చంపేట టౌన్/ ఉప్పునుంతల/ పెద్దకొత్తపల్లి/ తాడూరు/ బల్మూరు/ కోడేరు/ అమ్రాబాద్/ కల్వకుర్తి/ చారకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పేపర్ 1 పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. అక్కడక్కడా విద్యార్థులు 5నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించారు. బల్మూరులో పరీక్ష కేంద్రం సమీపంలో పలు దుకాణాలు, జిరాక్స్ సెంటర్లు తెరిచే ఉంచారు. శుక్రవారం అమ్రా బాద్ మండలం దోమలపెంట ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, వోఆర్ఎస్ ప్యాకెట్లు వైద్య సిబ్బంది అంబాటులో ఉంచాలని ఆదేశించారు. దోమలపెంట కేంద్రంలో 52 మంది విద్యార్థులకు గాను అందరు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీధర్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గోపాల్ పేర్కొన్నారు.

● కొల్లాపూర్‌లోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 718 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పెంట్లవెల్లిలోని ప్రభుత్వ బాలుర పాఠశాల, జటప్రోల్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 168 మంది విద్యార్థులకు గాను అందరూ హాజరయ్యారు. కొల్లాపూర్ మండలంలో పదవ తరగతి పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు వనజ, శోభారాణి, నిరంజన్, శ్రీశైలం, ఉపాధ్యాయులు వ్యవహరించారు. పెంట్లవెల్లిలో చీఫ్ సూపరింటెండెంట్‌లుగా రఘువర్ధన్‌రెడ్డి, కురుమయ్య ఉపాధ్యాయులు వ్యవహరించారు. కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



కొల్లాపూర్‌లో విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

● అచ్చంపేటటౌన్ : మండలంలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలలో 640 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. ● ఉప్పునుంతల మండలంలో 161 మంది విద్యార్థులకు అందరూ హాజరైనట్లు ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. తహసీల్దార్ ప్రమీల పరిశీలించారు.

● పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 200మంది విద్యార్థులు, బి సెంటర్‌లో 172మంది విద్యార్థులు, ఆల్ సెయింట్స్ స్కూల్లో సీ సెంటర్‌లో 206మంది విద్యార్థులు మొదటి రోజు తెలుగు పరీక్ష రాశారు. ఎస్ఐ వి.సతీష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవునితిర్మలాపూర్, వెన్నచెర్ల, ముష్టిపల్లి, గంట్రావుపల్లి, పెద్దకార్పాముల గ్రామాల నుంచి విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ఆటోలలో పరీక్ష రాసేందుకు వచ్చారు.

● తాడూరుతో పాటు సిర్సవాడలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాడూరు పరీక్ష కేంద్రానికి 229 మందికిగాను 228 మంది, సిర్సవాడలో అందరూ విద్యార్థులు హాజరయ్యారు.

● కోడేరు : మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 230 మందికిగాను 229మంది, జడ్పీహెచ్ఎస్‌లో 120 మందికిగాను ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ సుధారాణి, కురుమయ్య తెలిపారు.

● అమ్రాబాద్ : మండల పరిధిలోని మూడు సెంటర్లలో పదవ పరీక్షలు నిర్వహించారు. మండలంలో మొత్తం 435 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు మన్ననూర్ సెంటర్‌లో ఆరు గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో బాలకిషన్ తెలిపారు.

● కల్వకుర్తి : కల్వకుర్తిలో పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు హాజరై పరీక్షలు రాశారని ఎంఈవో శంకర్ తెలిపారు.

● చారకొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 177 మంది విద్యార్థులకు గాను మొత్తం విర్యార్థులు హాజరైనట్లు ఎంఈవో ఝాన్సీరాణి తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, డిపార్ట్‌మెంటల్ అధికారి మురళీధర్‌రెడ్డి ఉన్నారు. ఎస్ఐ శంషోద్దీన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



చారకొండ : హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పెద్దకొత్తపల్లి : పరీక్ష రాయడానికి ఆటోలో నిలబడి ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

కష్టజీవుల చెమట చుక్కనే కవిత్వం

- రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్ సింగ్

బిజినేపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 21 : కష్టజీవుల చెమట చుక్కనే కవిత్వమని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్ సింగ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ కవితా దినోత్సవం పురస్కరించుకొని కవి, రచయిత డాక్టర్ ప్రతాప్ కౌటిల్యను మెమెంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆంగ్ల భాషపై మక్కువతో మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్న తరుణంలో మాతృభాషలో కవిత్వం రాస్తూ తెలుగు భాషా మాధుర్యాన్ని, భావ వ్యక్తీకరణకు కవిత్వం తోడ్పాటును నేటి యువతకు గుర్తు చేస్తున్నారని కొనియాడారు. అలాగే మండలంలోని గంగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కవులుగా రాణిస్తున్న ఉపాధ్యాయులు కొముళయ్య, అశోక్ కుమార్‌లను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీతా ప్రతాప్, శశికళ, రాష్ట్ర మహనీయుల స్ఫూర్తి వేదిక చైర్మన్ రాజారాం ప్రకాష్, రత్నశేఖర్, మహమ్మద్, శ్రీకాంత్ రెడ్డి, ఇందుమతి, ప్రమీల ఉన్నారు.



ప్రతాప్ కౌటిల్యను సన్మానిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్ సింగ్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పరిహారం : ఆర్డీవో శ్రీను



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీను

చారకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమాల్‌పూర్ గ్రామంలోని సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి ఆలయ భూముల పరిహారం విషయమై కల్వకుర్తి ఆర్డీవో శ్రీను శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు.

సీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందిన సుమారు 52 ఎకరాల భూమి ఉంది. అందులో డిండి-నార్లాపూర్ ఎత్తిపోతల పథకం కాల్వ నిర్మాణంలో దాదాపు 51.32 ఎకరాల భూమి పోయింది. ఇదివరకే ఈభూములపై ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. ఇందుకుగాను ప్రభుత్వం ఎకరాకు రూ.5.30 లక్షలు చొప్పున మంజూరు చేసింది. పరిహారం విషయంలో ఇన్నాళ్లపాటు సాగు చేసిన రైతులు తమకే చెందాలని అంటుండగా, దేవాదాయ శాఖ అధికారులు ఆలయానికే పరిహారం చెందాలని అంటుండడంతో శుక్రవారం ఆర్డీవో గ్రామసభ నిర్వహించి, ఇరు వర్గాల వారితో చర్చించారు. 1954వ సంవత్సరం నుంచి ఆలయ భూములను సాగుచేస్తూ, కాపాడుకుంటూ కరువును ఎదుర్కొంటూ జీవిస్తున్న తమకే పరిహారం చెల్లించాలని ఆర్డీవోను కోరారు. ఏళ్ల తరబడి దేవాలయ భూములను అక్రమంగా సాగు చేస్తూ ఎన్నడూ కిస్తులు చెల్లించలేదని, దేవాలయం పేరుమీదనే పట్టాలు ఉన్నందున పరిహారం దేవాలయానికే చెల్లించాలని దేవాదాయ శాఖ అధికారులు ఆర్డీవోను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి సునీత, దేవాదాయశాఖ ఏసీ మదనేశ్వర్‌రెడ్డి, దేవాదాయ తహసీల్దార్ గిరిధర్, ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఆలయ ఈవో స్వర్గం ఆంజనేయులు, మేనేజర్ నిరంజన్, డీఎల్ఐ ఏఈ సుభాషిని, డీఎల్ఐ విశ్రాంత తహసీల్దార్ సుల్తాన్, ఆర్ఐ భరత్‌గౌడ్, కార్యదర్శి రవి, మాజీ జడ్పీటీసీ భీముడునాయక్, నర్సింహారెడ్డి, డేరం లక్ష్మణశర్మ, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

వెల్దండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలపడం గొప్పవిషయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మోతీలాల్, పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు రాజు, పర్వత్‌రెడ్డి, నారాయణ, పుల్లయ్య, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటం

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటయోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాట స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాటాలు నిర్వహిస్తామని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిలో భాగంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ కలలుగన్న సమాజం కోసం డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో రోజుకు ఒకచోట మతోన్మాదాన్ని లేపుతూ దేశ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని ఆరోపించారు. విద్యారంగంలోకి మూఢత్వాన్ని చొప్పించి దేశ చరిత్రను విచ్ఛిన్నం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు దేశంలో జరుగుతున్న విచ్ఛిన్నకర విధానాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్ధం సైదులు, కార్యదర్శి బి.శివవర్మ, ఉపాధ్యక్షుడు శివశంకర్, సహాయ కార్యదర్శి నాగపూర్ మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, నాయకులు బాలు నాయక్, మహేష్ చంద్రశేఖర్, శివ, కార్తీక్, చంద్ర పాల్గొన్నారు.

వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

- అదనపు కలెక్టర్ దేవ సహాయం

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను బకాయిలను ఈ నెల 31లోపు వందశాతం వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం ఆదేశించారు. కల్వకుర్తి మునిసిపల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలుపై మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలోని కమర్షియల్ వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్సులు ఇవ్వాలని, తీసుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వార్డు ఆఫీసర్లు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఉప్పునుంతల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఉన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

బిజినేపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 21 : భిన్నరుచుల సమ్మేళనంతో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు అన్నారు. మండలంలోని పాలెంలోని ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు వివిధ రకాల వంటకాలతో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ 2025ను కళాశాల ప్రిన్సిపాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తెలంగాణ ప్రాంతీయ వంటకాలైన రాగిజావ, జొన్న రొట్టెలు, సున్ని ఉండలు, రవ్వలడ్డు, ఉగాది పచ్చడి, బిర్యానీ తదితర వంటకాలు ఆకర్షనీయంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, లైబ్రేరియన్ వర్కాల శ్రీనివాసులు, అధ్యాపకులు సుష్మ, నాగరాజు, శివ, రాధాకుమారి, నాగలింగం, స్వప్న ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ'పై హర్షం

వంగూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడాన్ని హర్షిస్తూ శుక్రవారం జాజాలలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. దళితులు సీఎంకు రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో పరశురాములు, నరేందర్, శ్రీనివాసులు, నాగయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ పరామర్శ

పెద్దకొత్తపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జొన్నలబొగుడ గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆది ధర్మేందర్ తల్లి ఆది గౌరమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ జొన్నలబొగుడ గ్రామానికి వెళ్లి గౌరమ్మ భౌతికకాయంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనవెంట మాజీ సర్పంచ్‌లు వి.సత్యం, పి.చిన్నయ్య, పెద్దకొత్తపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ దేవరపాక బాలస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యులు రవికుమార్, బద్యనాయక్, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఫోరం జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు శుక్రవారం జొన్నలబొగుడ గ్రామానికి వెళ్లి ఆది గౌరమ్మ భౌతికకాయానికి పూల మాలలు వేసి, నివాళి అర్పించారు. ఆయన వెంట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేష్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బండి విజయ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోనాసి రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పుట్టపాగ రాము, కార్యదర్శి డీటీవో రాష్ట్ర కార్యదర్శి కొంగర జానయ్య పాల్గొన్నారు.

25న కొల్లాపూర్‌లో తైబజార్ వేలం

కొల్లాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీ స్పెషల్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ అనుమతి మేరకు ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు కొల్లాపూర్ మునిసిపల్ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తెలిపారు. డైలీ మార్కెట్‌తో పాటు మాసంపు, చికెన్ వ్యర్థాల సేకరణకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

26న మేకల సంతకు వేలం

చారకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రతీ శనివారం జరిగే మేకలు, గొర్రెల సంతకు ఈనెల 26న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఇసాక్‌హుసేన్, పంచాయతీ కార్యదర్శి గణేష్ శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే బహిరంగా వేలం పాటలో పాల్గొనాలని అన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

- మాజీ మంత్రి జే.చిత్తరంజన్‌దాస్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జే.చిత్తరంజన్‌దాస్, చిత్రంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిదాస్

కల్వకుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పార్టీతోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం దక్కుతుందని మాజీమంత్రి జే.చిత్తరంజన్‌దాస్ అన్నారు. ఏళ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు చరిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు డొక్క హరిదాస్‌లతో కలిసి మాజీ మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా పని చేస్తూ ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ మార్గదర్శకంలో నడుస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డినే మరో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు సీఎం ఎంతో ధైర్యం చేసి చట్టబద్ధత కల్పించారని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడూ బీసీ రిజర్వేషన్ల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో సైతం అన్ని రంగాలకు ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించినట్లు తెలిపారు. విలేకర్ల సమావేశంలో నాయకులు పెద్దయ్యయాదవ్, పర్శపాకుల శేఖర్, గోపాల్, లక్ష్మయ్య ఉన్నారు.

శాంతి భద్రతలు కాపాడటంలో ప్రభుత్వం విఫలం

- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం సొంత జిల్లాలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఇటీవల గొర్రెల దొంగతనాలు ఎక్కువయ్యాయని, గడిచిన నెల రోజులుగా శ్రీపురంలో 12, మంతటిలో 14, గుడిపల్లిలో 26, చిన్నముద్దు నూరులో 20, నర్సాయిపల్లిలో 6 గొర్రెలను దొంగలు అపహరించుకుపోయారని తెలిపారు. సంఘటనలపై బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసుల నుంచి స్పందన లేదని ఆరోపించారు. కలెక్టర్, ఎస్పీలు వెంటనే స్పందించి గొర్రెల దొంగలను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిక్కొండ్ర శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ తిరుమల్ యాదవ్, మంతటి మాజీ సర్పంచు నాగయ్యయాదవ్, గొర్లకాపరి సంఘం మండల అధ్యక్షుడు తిరుపతయ్యయాదవ్, నాయకులు కుర్మయ్యయాదవ్, సుధాకర్ యాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నిరుద్యోగికి 'వికాసం' వర్తింపజేయాలి

- తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ



విలేకరులతో మాట్లాడుతున్న దేవని కుమార్ మాదిగ

కొల్లాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ నిరుద్యోగికి రాజీవ్ యువ వికాసం పథకం వర్తింపజేయాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం హర్షణీయమని అన్నారు. అదేరకంగా రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు పథకం అమలు చేసి నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పథకం కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను దృష్టిలో పెట్టుకుని వారికి యూనిట్ల పరంగా ఇవ్వకుండా వారికి నగదు కేటాయిస్తే వాళ్లు ఖచ్చితంగా సెకండ్ హ్యాండ్ ఆటోలు, ట్రాలీ, ఆటోలు కొనుక్కొని జీవనం కొనసాగిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో దళిత సంఘం నాయకులు శీలం వెంకటేష్, పసుపుల కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకారుల ముందస్తు అరెస్టు



కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన మత్స్యకారులు

బిజినేపల్లి, మార్చి (ఆంధ్రజ్యోతి) 21 : రాష్ట్ర బడ్జెట్‌లో మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా కేటాయించకపోవడంపై మత్స్యకారులు ఆగ్రహంతో శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర నాయకత్వం పిలుపునివ్వడంతో ముందస్తుగా మండలంలోని ఆయా గ్రామాల మత్స్య కారులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. మత్స్యకార సంఘాల నాయకులు మాట్లాడుతూ చేపల వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు న్యాయమైన రిజర్వేషన్ ఫలాలు అందాలంటే బీసీ ఏ గ్రూపు నుంచి బీసీ డీకి మార్చాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో మత్స్యకారుల జనాభా ఆధారంగా సంక్షేమం కోసం రూ.2 వేల కోట్లకు తగ్గకుండా నిధులు కేటాయించి తమ సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ముందస్తు అరెస్టు చేసిన వారిలో తుమ్మల అల్లోజీ, బంగారయ్య, భూపేష్, నరసింహ, గంగనమోని శివ, ఆంజనేయులు, తుమ్మల శేఖర్ ఉన్నారు.

● వంగూరు : వంగూరు మండలంలోనూ మత్స్య కారులను పోలీసులు అరెస్టు చేశారు. మండంలోని తిర్మలగిరి చేపల సొసైటీ చైర్మన్ తిరుపతయ్య, గోవర్ధన్, సైదులు, గోపాల్, రమేష్, సాయిబాలును అరెస్టు చేశారు. వారిని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

● కొల్లాపూర్ : కొల్లాపూర్‌లోనూ పోలీసులు మత్స్యకారులను ముందస్తు అరెస్టు చేశారు. కృష్ణా జలాల పరివాహక ప్రాంతం కొల్లాపూర్‌లోని తెనుగు, బెస్తలుగా పిలువబడే వారికి ఏ గ్రూప్ సర్టిఫికెట్లు ఇవ్వాలని నాయకులు కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటలను నిలుపుకోవాలని లేదంటే ఉద్యమాలతో పాటు రాబోయే రోజుల్లో మత్స్యకారుల ఓట్లకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరించారు.

ఆశా వర్కర్ల ఆందోళన

వెల్దండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఎదుట ఆశావర్కర్లు ఆందోళన చేపట్టారు. ఏఎన్ఎం శిక్షణ పొందిన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, 50 లక్షల ఇన్సూరెన్స్ హామీ అమలుచేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, ప్రసూతి సెలవులు అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న, మండల అధ్యక్షురాలు మంగమ్మ, సహాయకార్యదర్శి యాదమ్మ, వసంత, రోజ ఉన్నారు.

సింగారంలో సీసీ రోడ్డు పనులు

అచ్చంపేటటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సింగారం గ్రామంలో ఎస్సీ సబ్ ప్లానింగ్ నిధులతో రూ.5లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను పంచాయతీ కార్యదర్శి మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు నీలం శేఖర్, కేతావత్ శ్రీనివాస్, పానుగంటి శివ, పానుగంటి సాయిబాబు, పెద్ద అంతయ్య, నరేందర్, జగన్, రాజేందర్, బక్కయ్య, వెంకటేష్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో గ్రామంలోని వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.